RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్
సంపుటి : 3, సంచిక : 179

బుధవారం
జూన్ 11, 2025

పేజీలు : 4
వెల : రూ.3-00



శివుడిని మించిన ఖాకీ..!

4లో..



## దేశానికి రోల్ మోడల్

# భూ భారతి

**రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి**

**వేద న్యూస్, మిర్యాలగూడ ప్రతినిధి :**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న భూ భారతి చట్టం దేశానికే రోల్ మోడల్‌గా నిలుస్తుందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. నల్గొండ జిల్లా మిర్యాలగూడలో సోమవారం మంత్రులు కోమటి రెడ్డి వెంకటరెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి,పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పర్యటన జరిపారు. స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అధ్యక్షతన ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలు,సన్న బియ్యం పంపిణీ చేసిన అనంతరం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ, సమాచార,పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ రానున్న మూడున్నర ఏళ్లలో రాష్ట్ర వ్యాప్తంగా 20 లక్షల ఇందిరమ్మ ఇండ్లు ఇస్తున్నామన్నారు.

మొదటి విడతన నియోజకవర్గానికి మూడు వేల ఐదు వందలు చొప్పున రూ.22500 కోట్లు ఇస్తున్నామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు ప్రతి సోమవారం బిల్లులు చెల్లిస్తామన్నారు.రాబోయే వారం,పది రోజుల్లో పైలెట్ గ్రామాలలో గృహప్రవేశాలు చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.400 చదరపు అడుగులు నుండి 600 చదరపు అడుగులలోపు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకునేలా నిర్ణయించడం జరిగింది అని తెలిపారు. లబ్ధిదారులు ఎంత త్వరగా ఇల్లు పూర్తి చేసుకుంటే అంత త్వరగా బిల్లు ఇస్తామని హామీ ఇచ్చారు.పేదవాడి కల నెరవేర్చాలి అన్నదే తమ లక్ష్యం అని చెప్పారు.

అందుకే మొదటి విడత రాష్ట్ర వ్యాప్తంగా నాలుగున్నర లక్షల ఇందిరమ్మ ఇండ్లు ఇస్తున్నామన్నారు. గతంలో కూడా తాము అధికారంలో ఉన్నప్పుడే అత్యధికంగా ఇందిరమ్మ ఇళ్లు నిర్మించామన్నారు.అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లతో పేదలకు అందించాలన్నది ప్రభుత్వ నిర్ణయం అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని గాడిలో పెడుతూ సంక్షేమ పథకాలన్నింటినీ అమలు చేస్తున్నాము.ఆగస్టు 15 నాటికి భూ భారతి ద్వారా భూములు ఉన్న ఆసాములకు పూర్తి స్వేచ్ఛను కల్పిస్తామన్నారు. ఈ నెల 20 నుండి ఆగస్టు 15 నాటికి ఈ సమస్యలను పరిష్కరించనున్నాము. భూభారతి చట్టన్ని దేశ వ్యాప్తంగా 18 రాష్ట్రాల్లో పర్యటించి అన్ని విషయాలను క్రోడీకరించి అద్భుతమైన చట్టాన్ని తయారు చేశామని వెల్లడించారు.ఏప్రిల్ 14న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ పుట్టినరోజున ప్రజలకు అంకితం చేశామనీ భూ భారతి రెవెన్యూ సదస్సులలో అధికారులే దరఖాస్తులు రాస్తారన్నారు. భూ సమస్యల పరిష్కారానికి ఒక్క రూపాయి కూడా ఎవ్వరికి ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. తహసిల్దార్,ఆర్డిఓ,కలెక్టర్ తప్పులు చేస్తే సీసీఎల్ఏ వరకు అప్పీల్ చేసుకునే అధికారం ఉంది. ధరణిలో ఇలాంటి అవకాశం లేదు.దేశానికి మన రెవెన్యూ వ్యవస్థ రోల్ మోడల్ గా ఉండబోతున్నది అని ధీమా వ్యక్తం చేశారు. వచ్చే అసెంబ్లీలో ఎన్నికల్లో భూభారతి చట్టాన్ని రెఫరండంగా పెట్టుకుని వెళ్తాం అన్నారు. పేదల కోసమే ప్రభుత్వం పని చేస్తున్నది. సాదా బై నామాలకు సంబంధించి 9 లక్షల 25 వేల దరఖాస్తులు పెండింగ్లో ఉన్నాయి.

### ధరణిలో వీటి పరిష్కారానికి అవకాశం లేదు

భూ భారతిలో అలాంటి అవకాశాన్ని కల్పించామన్నారు. ఆధార్ కార్డులాగే భూధార్ కార్డుని ఇచ్చి ఖాతా నెంబర్ ను ఇస్తున్నాము అని అన్నారు. రానున్న 30 రోజుల్లో రాష్ట్రంలో ఆరు వేల మంది లైసెన్స్‌డ్ సర్వేయర్‌లను నియమించనున్నాము గుర్తు చేశారు. పదివేల 956 రెవిన్యూ గ్రామాలలో గ్రామ పాలన అధికారులను నియమించనున్నాము అన్నారు. ప్రతి డిసెంబర్ 31న జమాబంది ఏర్పాటు చేసేలా చట్టం లో పెట్టాము అని అన్నారు. అనంతరం రాష్ట్ర శాసనమండలి

మిగతా 4వ పేజీలో..

## 'బంధన్'పై విచారణ, చర్యలకు ఆదేశాలు

- డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ నుంచి..
- నివేదిక సైతం పంపాలని హనుమకొండ డీఎం.హెచ్‌వో కు సూచన

**వేద న్యూస్, హన్మకొండ :**

బంధన్ హాస్పిటల్‌లో తనకు జరిగిన అన్యాయంపై బాధితుడు లింగబత్తిని కృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బంధన్ హాస్పిటల్ యాజమాన్యం, డాక్టర్ నలిని కృష్ణపై విచారణ జరిపి.. తగు చర్యలు తీసుకోవాలని హన్మకొండ డిఎంఅండ్ హెచ్ వో ను డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డైరెక్టర్ ఆదేశించారు. టీ జీసీఈ యాక్ట్ (చట్టం) ప్రకారం ఫిర్యాదుదారుకు సైతం సమాచారం అందించి.. సదరు ఆసుపత్రి పై విచారణ అనంతరం తీసుకున్న చర్యలపై నివేదికను డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ఆఫీసుకు పంపించాలని అడిషనల్ డైరెక్టర్ (ప్లానింగ్) డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ పేర్కొన్నారు.

## సీపీని మర్యాదపూర్వకంగా కలిసిన సీఐ రమేశ్

**వేద న్యూస్, వరంగల్ క్రైమ్:**



వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఏ.జే మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన బొల్లం రమేశ్ మంగళవారం వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్‌ను కలిసి మొక్క అందజేశారు. పోలీస్ శాఖ కీర్తి ప్రతిష్ఠ పెంచేలా విధులు నిర్వహించి, ప్రజల మన్ననలు పొందాలని సీఐకి సీపీ సూచించారు.

## బస్ చార్జీలను పెంచి విద్యార్థులపై భారం మోపడం సరికాదు

**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :**

రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల బస్ పాస్ చార్జీలను 20 శాతం పెంచడం పట్ల బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్టీసీ బస్సు ధరల పెంపును తక్షణమే ఉపసంహరించుకోవాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఇప్పటికే గ్రామీణ,పట్టణ ప్రాంత విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మళ్ళీ 20 శాతం చార్జీలు పెంచితే బలహీన వర్గాలకు చెందిన విద్యార్థుల పైన భారం పడుతుందన్నారు. సగటున నెలకు రూ.250 నుంచి రూ.350 వరకు సామాన్య ప్రజల పైన, విద్యార్థుల పైన భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.ఒక వైపు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తూ మరోవైపు చార్జీలు పెంచుతూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఎద్దేవా చేశారు. పెంచిన చార్జీలను వెంటనే ఉపసంహరించుకోవాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున విద్యార్థులతో బస్సు భవన్ ను ముట్టడిస్తామని హెచ్చరించారు.

## పాకాలను ఎకో టూరిజంగా అభివృద్ధి చేయడానికి ప్లాన్స్ సిద్ధం చేయండి

- కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**వేద న్యూస్, నర్సంపేట :**



పాకాలను ఎకో టూరిజంగా మరింత అభివృద్ధి చేయుటకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ డాక్టర్ సత్య శారద జిల్లా అటవీ శాఖ అనూజ్ అగర్వాల్ తో కలిసి క్షేత్రస్థాయిలో నర్సంపేట రేంజ్ లోని పాఖాలలో గ్రీన్ హెరిటేజ్ క్రింద అభివృద్ధి చేసిన బయోడైవర్సిటీ పార్కును, బట్టర్, ట్రెక్కింగ్, సైక్లింగ్, పగోడాలను పరిశీలించిన అనంతరం కలెక్టర్ పాకాల సరస్సులో బోటింగ్ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పర్యాటకులకు ఆకర్షించే విధంగా పాకాల సరస్సు పరిసర ప్రాంతాలను మరింత అభివృద్ధి చేయుటకు పటిష్టమైన ప్రణాళికలు రచించాలని డీఎఫ్ఓకు సూచించారు. అందులో భాగంగా బయోడైవర్శిటీ పార్క్ ను మరింత అభివృద్ధి పరచడం, పర్యావరణ పర్యాటక అభివృద్ధి చేయాలని, సఫారీ ట్రాక్ ఏర్పాటు, మూలికల తోట పునరుద్ధరణ, సందర్శకులకు రాత్రి బస సౌకర్యాల అభివృద్ధి, చెరకు ప్యాచ్ అభివృద్ధి, పర్యావరణ పర్యాటక సంబంధిత కార్యకలాపాలకు సంబంధించిన పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఆర్ఓ రవి కిరణ్, డిప్యూటీ ఎఫ్ఆర్ఓ, అటవీ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

- నకిలీ విత్తనాలు, పురుగు మందుల విక్రయాలపై సమాచారం ఇవ్వండి
- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్

**వేద న్యూస్, వరంగల్ క్రైమ్ :**

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నకిలీ విత్తనాలు, పురుగు మందులు విక్రయిస్తున్నట్లుగా సమాచారం అందితే తక్షణమే పోలీసులకు సమాచారం అందించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ప్రజలకు సూచించారు. వానాకాలం సాగు ప్రారంభమవుతున్న వేళను దృష్టిలో వుంచుకోని రైతన్న నకిలీ విత్తనాల బారీన పడకుండా ముందస్తు చర్యలకై వరంగల్ కమిషనరేట్ పోలీసులు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా వరంగల్ కమిషనరేట్ పోలీసులు రూపొందించిన ప్రచార పోస్టర్లను మంగళవారం పోలీస్ కమిషనర్ అధికారులతో కలసి ఆవిష్కరించారు.ఈ నకిలీ విత్తనాల నియంత్రణకై వరంగల్ పోలీస్ కమిషనర్ ఓ ప్రకటన చేస్తూ ఎవరైన వ్యాపారస్థులు, సంస్థలు, వ్యక్తులు రైతన్నను మోసం చేస్తూ నకిలీ విత్తనాలను, పురుగు మందులు విక్రయిస్తుతే పిడి యాక్ట్ క్రింద కేసు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. నకిలీ విత్తనాలను విక్రయాలను నియంత్రియించేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించడం జరిగిందన్నారు. ఇప్పటికే వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మొత్తం ఒక కోటి 23 లక్షల విలువ నకిలీ పురుగు మందులు, విత్తనాలతో పాటు పెద్ద ఎత్తున గడ్డి మందును స్వాధీనం చేసుకోవడం తో పాటు 14మంది నిందితులను అరెస్ట్ చేసి జైలుకు తరలించడం జరిగిందని...ఇకపై ఎవరైనా నకిలీ విత్తనాలు, పురుగు మందులు విక్రయిస్తున్నట్లు సమాచారం అందితే తక్షణమే స్థానిక పోలీసులకుగాని లేదా వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఫోన్ నంబర్ 77998 48333 ఫోన్ నంబరకు సమాచారం అందించాలని. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా వుంచబడుతుందని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలియజేసారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో అదనపు డీసీపీ రవి, ఏసీపీ లు జితేందర్ రెడ్డి, డేవిడ్ రాజు, ఇన్స్ స్పెక్టర్ విశ్వేశ్వర్ పాల్గొన్నారు.

## గ్రామసభ ద్వారానే లబ్ధిదారులను ఎంపిక చేయాలి

**వేద న్యూస్,శాయంపేట:**



శాయంపేట మండలంలోని ఎంపీడీవో కార్యాలయం ముందు గ్రామసభ ద్వారానే ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక ప్రక్రియ జరగాలని బహుజన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మారపల్లి క్రాంతి కుమార్ బహుజన సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ గ్రామ సభ ద్వారా నిర్వహించకుండా, ఇష్టం వచ్చిన రీతిలో ఎంపిక ప్రక్రియ చాటుమాటున ఎందుకు ఎంపిక చేశారని ఎంపీడీవోని ప్రశ్నించారు. ఈ ఎంపిక ప్రక్రియతో మాకు సంబంధం లేదు అది ప్రభుత్వం తీసుకున్నటువంటి నిర్ణయం అని చెప్పడం చాలా విడ్డూరంగా ఉందని అన్నారు.మీరు ఏదైనా అడగాలి అని అనుకుంటే ప్రభుత్వాన్ని అడగండి అని మా దగ్గర కాదు అని చెప్పడం పట్ల ఆయన విధుల పట్ల ఎంత నిజాయితీగా ఉన్నాడో అర్థం చేసుకోవచ్చని అన్నారు. అదేవిధంగా ఈ ప్రభుత్వం ప్రజా పాలన ప్రభుత్వం ఈ ప్రభుత్వంలో పేదలకు న్యాయం జరుగుతుందని, ఈ ప్రభుత్వం పేదల పక్షపాతి అని, ప్రజలు చాలా ఆశగా ఉన్నారు. కానీ దానికి భిన్నంగా భూపాలపల్లి నియోజకవర్గంలోని శాయంపేట మండలంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ఎలా జరిగింది అని అధికారులని అడిగితే ఇందిరమ్మ కమిటీ నీ, ఇందిరమ్మ కమిటీ వాళ్ళని అడిగితే అధికారుల పైన ఒకరిపై ఒకరు చెబుతూ పేద ప్రజలకు అన్యాయం జరిగే విధంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది ప్రజా పాలనకు వ్యతిరేకంగా గ్రామసభల ద్వారా ఎంపిక జరగకుండా ఉండడాన్ని నిరసిస్తూ శాయంపేట ఎంపీడీవో కార్యాలయం ముందు

మిగతా 4వ పేజీలో..

వేద న్యూస్

బుధవారం, జూన్ 11, 2025

# రాష్ట్రవ్యాప్తంగా 'సాక్షి' కార్యాలయాలపై దాడులు అప్రజాస్వామికం

**వేద న్యూస్, విజయవాడ :**

రాష్ట్రవ్యాప్తంగా సాక్షి మీడియా కార్యాలయాలపై వ్యవస్థీకృత దాడులు జరుగుతున్నాయని, ఇది అప్రజాస్వామికం అని వైసీపీ అధినేత జగన్ మండిపడ్డారు. ఇవి ప్రజాస్వామ్యంపై ఉద్దేశపూర్వకంగా, పథకం ప్రకారం జరుగుతున్న దాడులని ఆయన అభివర్ణించారు. సాక్షి టీవీ యాంకర్, సీనియర్ జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాసరావు అరెస్ట్ ను జగన్ ఖండించారు. సోమవారం నాడు కొమ్మినేని శ్రీనివాసరావును పోలీసులు అరెస్ట్ చేయగా, మంగళవారం గుంటూరులోని కోర్టు ఆయనకు జ్యుడీషియల్ కస్టడీ విధించింది. సాక్షి చానల్లో కొమ్మినేని వ్యాఖ్యాతగా వ్యవహరించిన ఓ కార్యక్రమంలో అమరావతి ప్రాంత మహిళలపై కించపరిచేలా మాట్లాడారన్నది ఆయనపై ఉన్న ఆరోపణ. అయితే, కొమ్మినేని ఎప్పుడూ అనని మాటలను ముఖ్యమంత్రి చంద్రబాబు వక్రీకరించి, ఆయనపై తప్పుడు కేసు బనాయించి, అక్రమంగా అరెస్ట్ చేయించారని జగన్ ఆరోపించారు. "మహిళల గౌరవాన్ని కాపాడే నెపంతో, ముందస్తు ప్రణాళిక ప్రకారం టీడీపీ మూకలు పలు జిల్లాల్లోని సాక్షి యూనిట్ కార్యాలయాలను ధ్వంసం చేశాయి. ఇది మహిళల పట్ల ఆందోళనగా చిత్రీకరిస్తున్న రాజకీయ కక్ష సాధింపు చర్య తప్ప మరొకటి కాదు" అని జగన్ 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు.



గతంలో చంద్రబాబు, ఆయన బావమరిది బాలకృష్ణ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలను ఈ సందర్భంగా జగన్ ప్రస్తావిస్తూ, వారి నైతికతను ప్రశ్నించారు. "కోడలు అత్తగారిని కాకుండా భర్తనే ఇష్టపడుతుంది కదా అని మీరొకసారి అన్నారు. మీ బావమరిది అయితే అమ్మాయి కనిపిస్తే ముద్దయినా పెట్టాలి లేదా కడుపైనా చేయాలి అన్నారు. మహిళలను గౌరవించే విషయంలో ఇవి మీ ప్రమాణాలు!" అని జగన్ రాశారు. తిరిగి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మహిళలు, బాలికలకు భద్రత, న్యాయం కల్పించడంలో చంద్రబాబు పూర్తిగా విఫలమయ్యారని మాజీ సీఎం ఆరోపించారు. అనంతపురంలో అదృశ్యమై, ఆ తర్వాత దారుణంగా హత్యకు గురైన ఇంటర్ విద్యార్థిని తన్మయి కేసులో అధికారులు సత్వర చర్యలు తీసుకోలేదని ఆయన ఉదహరించారు. అలాగే, శ్రీ సత్యసాయి జిల్లా రామగిరి మండలంలో 9వ తరగతి బాలికను 14 మంది ఆరు నెలలుగా బ్లాక్‌మెయిల్ చేసి అత్యాచారం చేసినా పోలీసులు ఆమె ఫిర్యాదుపై చర్యలు తీసుకోలేదని ఎత్తి చూపారు. "కేవలం ఏడాది టీడీపీ పాలనలో 188 మంది మహిళలు, బాలికలపై అత్యాచారాలు జరిగాయి, వారిలో 15 మంది హత్యకు గురయ్యారు. వేధింపులు, హింసకు సంబంధించిన వందలాది కేసులు శిక్ష పడకుండానే మిగిలిపోయాయి" అని జగన్ పేర్కొంటూ, ఇది శాంతిభద్రతల పూర్తి వైఫల్యమని అన్నారు.

# దేశం అభివృద్ధి పథంలో దూసుకెళుతోంది



**వేద న్యూస్, న్యూఢిల్లీ :**

భారత ప్రధాని నరేంద్ర మోదీపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రశంసల జల్లులు కురిపించారు. మోదీ నాయకత్వంలో.. ఈ 11సంవత్సరాలలో దేశంలోని అన్ని రంగాలు అభివృద్ధి పథంలో ముందుకి దూసుకెళుతున్నాయని అన్నారు. దేశ ప్రజల కోసం ఆయన అనేక సంక్షేమ కార్యక్రమాలు అందించారని అన్నారు. మంగళవారం ఎన్టీఆర్ జిల్లాలో జరిగిన ఓ కార్యక్రమంలో కిషన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ' ఒక్క రూపాయి అవినీతి జరిగిందని ఏ రాజకీయ పార్టీ కూడా ఆరోపణలు చేయలేదు. నీతి నిజాయితీతో ఒక సమర్ధవంతమైన నాయకత్వంతో మోదీ పాలన కొనసాగుతోంది. ప్రపంచ దేశాలు సైతం భారత దేశం వైపు చూసేలా మోదీ పాలన సాగుతోంది. అన్ని సామాజిక వర్గాల వారికి పెద్ద పీట వేసి పాలన చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపట్టిన అనేక పథకాలు క్షేత్ర స్థాయిలో అమలు జరిగేలా ప్రణాళికలు ఉంటున్నాయి. కరోనా సమయంలో పేద ప్రజలు ఎవరు ఆకలితో ఉండకూడదనే ఉద్దేశంతో రేషన్ అందించారు. 4 కోట్ల ప్రజలకి ఇళ్లు కట్టించారు. మౌలిక రకమైన మార్పులు తీసుకొచ్చారు' అని అన్నారు.

## తొక్కిసలాటపై
# హైకోర్టు ఆగ్రహం




**వేద న్యూస్, ఇంటర్నెట్ డెస్క్:**

చిన్నస్వామి స్టేడియం వద్ద ఈనెల 5న జరిగిన తొక్కిసలాటలో 11 మంది మృతిచెందిన ఘటనపై కర్ణాటక ప్రభుత్వంపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రభుత్వ జవాబుదారీతనంపై ప్రశ్నించింది. ఈవెంట్ నిర్వహణ, అనంతరం వ్యవహించిన తీరు అనేక ప్రశ్నలకు తావిస్తోందని పేర్కొంది. ఇంతటి విపత్తుకు దారితీసిన కారణాలు ఏమిటి? భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే దానిపై సమాధానం ఇవ్వాలని కర్ణాటక ప్రభుత్వానికి నోటీసు పంపింది. తొక్కిసలాట ఘటనపై సుమోటో విచారణను కోర్టు మంగళవారంనాడు చేపట్టింది. ప్రభుత్వం తీసుకున్న చర్యలపై పలు ప్రశ్నలను హైకోర్టు సంధిస్తూ, వీటిపై వివరణ ఇవ్వాలని కర్ణాటక ప్రభుత్వం తరఫున హాజరైన అడ్వకేట్ జనరల్ (ఏజీ)ని ఆదేశించింది. ఈ సందర్భంగా తొమ్మది ప్రశ్నలు వేసింది.

**1. విజయోత్సవం (విక్టరీ సెలబ్రేషన్) నిర్వహించాలని ఎప్పుడు, ఎవరు నిర్ణయం తీసుకున్నారు? ఏ పద్ధతిలో తీసుకున్నారు?**

**2.ట్రాఫిక్ నియంత్రణకు తీసుకున్న చర్యలు ఏమిటి?**

**3.పబ్లిక్/జనసమ్మర్ధాన్ని నియంత్రించేందుకు తీసుకున్న చర్యలు ఏమిటి?**

**4.సభాస్థలి (వెన్యూ) వద్ద ఎలాంటి మెడికల్, ఇతర సదుపాయాలు ఏర్పాటు చేశారు?**

**5.ముందస్తుగా ఎంత మంది హాజరవుతారని అంచనా వేశారు? సెలబ్రేషన్స్ సమయంలో ఎవరు హాజరై ఉండవచ్చు?**

**6.క్షతగాత్రులకు తక్షణ వైద్యసహాయం కల్పించారా? కల్పించని పక్షంలో ఎందుకు కల్పించలేదు?**

**7.గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించేందుకు ఎంత సమయం పట్టింది?**

**8. ఇలాటి సెలబ్రేషన్లు, స్పోర్టింగ్ ఈవెంట్ జరిగినప్పుడు 50,000 మంది, అంతకుమించి వస్తే తీసుకోవాల్సిన చర్యలపై స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ ఏదైనా ఉందా?**

**9. ఈవెంట్ నిర్వహణకు అనుమతి ఏదైనా తీసుకున్నారా?**

## ఈరోజు నా హృదయం
# కృతజ్ఞతతో నిండిపోయింది: బాలకృష్ణ

**తన పుట్టినరోజున అభిమానులు చేసిన సేవలకు బాలకృష్ణ కృతజ్ఞతలు**



**వేద న్యూస్, డెస్క్ :** తన జన్మదినం (జూన్ 10) సందర్భంగా అభిమానులు, నాయకులు, కార్యకర్తలు రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎంతో ఉత్సాహంగా నిర్వహించిన సేవా కార్యక్రమాల పట్ల ప్రముఖ సినీ నటుడు, హిందూపురం శాసనసభ్యుడు నందమూరి బాలకృష్ణ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అభిమానులు చూపిన ప్రేమ, అభిమానం, ఆశీస్సులు తన జీవితానికి మరింత అర్థాన్ని ఇచ్చాయని ఆయన పేర్కొన్నారు. తన పుట్టినరోజును పురస్కరించుకుని గ్రామ గ్రామాన, మండల కేంద్రాల్లో అన్నదానాలు, రక్తదాన శిబిరాలు వంటి ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు. "ఈరోజు నా హృదయం కృతజ్ఞతతో నిండిపోయింది. మీరు చూపిన ప్రేమ, అభిమానం, ఆశీస్సులు నా జీవితానికి మరింత అర్థం ఇచ్చాయి," అని బాలకృష్ణ తన సందేశంలో పేర్కొన్నారు. ముఖ్యంగా, బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ రీసెర్చ్ ఇన్ స్టిట్యూట్‌లో తన అభిమానులు స్వయంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని బాలకృష్ణ ప్రత్యేకంగా ప్రశంసించారు. "రక్తదానం అనేది జీవితాన్నే ఇచ్చే గొప్ప దానం. మీ ప్రేమ కేవలం మాటల్లో కాదు... ఆచరణలో, సేవలో, మానవత్వంలో చూపించటమే నాకు గొప్ప గర్వకారణం. నిజమైన అభిమానం అంటే ఇదే!" అంటూ అభిమానుల సేవానిరతిని కొనియాడారు. ఒకటి రెండు కాదు, ఎన్నో జీవితాలకు వెలుగునిచ్చే మంచి పనులు చేయడం అభిమానుల విశాల హృదయానికి నిదర్శనమని బాలకృష్ణ అన్నారు. ఈరోజు తనను ఆశీర్వదించిన ప్రతి ఒక్కరికీ, ఈ సేవా కార్యక్రమాలలో పాల్గొన్న ప్రతి సహృదయుడికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుకుంటున్నానని పేర్కొన్నారు. అభిమానుల ప్రేమ, మద్దతు తనకు జీవితాంతం స్ఫూర్తిగా నిలుస్తాయని, వారితో కలిసి మరిన్ని సేవా కార్యక్రమాలు చేయాలనే ఉత్సాహాన్ని తనలో నింపారని ఆయన వివరించారు. ఈ రోజును తన జీవితంలోని మరపురాని రోజుగా మార్చిన ప్రతి ఒక్కరికీ బాలకృష్ణ మరోసారి ధన్యవాదాలు తెలియజేశారు.

# తిరుమల అడవుల్లో అగ్ని ప్రమాదం



**వేద న్యూస్, న్యూఢిల్లీ :**

కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీనివాసుడు వెలసిన తిరుమల శేషాచల కొండల్లో అగ్ని ప్రమాదం జరిగింది. శ్రీవారి పాదాలకు వెళ్ళే దారిలో ఉన్న కొండల్లో మంగళవారం మంటలు చెలరేగాయి. శిలాతోరణం, శ్రీవారిపాదాల దగ్గర అటవీ ప్రాంతలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ విషయంపై సమాచారం అందుకున్న వెంటనే స్పందించిన అగ్నిమాపక సిబ్బంది.. వెంటనే ఫైరింజన్ల సాయంతో ప్రమాద స్థలానికి చేరుకున్నది. రెండు ఫైరింజన్ల సమయంలో అడవిలోని మంటలను నియంత్రించింది. అయితే అప్పటికే 100 మీటర్ల మేర అడవి అగ్నికి ఆహుతి అయ్యింది. అగ్ని ప్రమాదంతో ఆ మార్గంలో వెళ్తున్న భక్తులు భయాందోళనకు గురయ్యారు. అయితే మంటలు చెలరేగడానికి గల కారణాలు ఏంటనేదీ తెలియాల్సి ఉంది. ఈ ప్రమాదం వెనుక ఏదైనా కుట్ర ఉందా? లేక ప్రమాదవశాత్తు జరిగిందా అనే విషయంపై అధికారులు ఆరా తీస్తున్నారు. శ్రీవారి భక్తులు తిరుమలకు అలిపిరి, శ్రీవారి పాదాలు ఈ రెండు ద్వారా నడుచుకుంటూ చేరుకుంటారు. ఈ శ్రీవారి పాదాలు పురాణాల ప్రకారం.. స్వయంగా శ్రీ వెంకటేశ్వర స్వామీ నడిచిన మార్గం అని.. మొదట కాలు పెట్టిన ప్రాంతం ఇదేనని నమ్మకం. శ్రీవారి పాదముద్రలే అందుకు సజీవ సాక్షం.. అందుకనే ఈ మెట్ల మార్గాన్ని శ్రీవారి పాదాలు అని అంటరాని నమ్మకం. శ్రీవారి దర్శనానికి వెళ్ళే చాలా మంది భక్తులు ప్రకృతి సహజ అందాలను వీక్షించేందుకు అలాగే శ్రీవారి పాదాలను స్పృశించి తక్కువ సమయంలోనే శ్రీవారి చెంతకు చేరుకోవచ్చు అనే ఉద్దేశ్యంతో ఇక్కడకు వస్తారు. శ్రీవారి పాదాల చెంతకు యాత్రికులు టీటీడీ ఏర్పాటు చేసిన ఉచిత బస్సు లేదా ప్రైవేట్ టాక్సీల ఆర్టీసీ బస్సు, ఆటోల ద్వారా చేరుకోవచ్చు.

# రెండు రోజులు పాటు భారీ వర్షాలు



**వేద న్యూస్, అమరావతి :**

వాయువ్య ఉత్తరప్రదేశ్ నుంచి పశ్చిమ మధ్య బంగాళాఖాతం వరకు ఉత్తర మధ్యప్రదేశ్, దక్షిణ ఛత్తీస్‌గఢ్.. మధ్య ఒడిశా మీదుగా సగటు సముద్ర మట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో ద్రోణి కొనసాగుతుందని ఏపీ విపత్తుల నిర్వహణ వెల్లడించింది. ఈ ప్రభావంతో రానున్న రెండు రోజులపాటు రాష్ట్రంలో పలు చోట్లు భారీ వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపింది. గంటకు 40 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశముందని పేర్కొంది. ప్రజలు హోర్డింగ్స్, చెట్ల కింద, శిథిలావస్థలో ఉన్న గోడలు, భవనాలు వంటి వాటి దగ్గర నిలబడ వద్దని సూచించింది.

మరోవైపు కొన్ని ప్రాంతాల్లో ఉక్కపోతతో పాటు ఎండ ప్రభావం చూపే అవకాశం ఉందని చెప్పింది. ఈ విభిన్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించింది. రేపు అంటే.. బుధవారం విజయనగరం, పార్వతీపురం మన్యం, పశ్చిమ గోదావరి, ఏలూరు, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, నెల్లూరు జిల్లాల్లో 40 నుంచి 41 డిగ్రీల సెంటిగ్రేడ్ వరకు ఉష్ణోగ్రతలు రికార్డు అయ్యే అవకాశం ఉందంది.

# అలాంటి వారికి మా దేశంలోకి ప్రవేశించే హక్కు లేదు

**వేద న్యూస్, న్యూఢిల్లీ :**

భారతీయ విద్యార్థి పట్ల అమెరికా అధికారులు ప్రవర్తించిన తీరు ప్రస్తుతం చర్చనీయాంశమవుతోంది. న్యూయార్క్ ఎయిర్‌పోర్ట్‌లో విమానం దిగిన అతడ్ని సెక్యూరిటీ అధికారులు అడ్డుకున్నారు. నేలకేసి నొక్కిపెట్టి హింసించారు. ఇదుకు సంబంధించిన వీడియో వైరల్ అయ్యింది. ఈ ఘటనను భారతీయులు తీవ్రంగా ఖండించారు. ఈ ఘటన నేపథ్యంలో భారత్‌లోని యూఎస్ రాయబార కార్యాలయం తాజాగా కీలక వ్యాఖ్యలు చేసింది. చట్టబద్ధమైన ప్రయాణికులను అమెరికా స్వాగతిస్తూనే ఉంటుందని పేర్కొంది. అయితే, చట్టవిరుద్ధమైన వారికి తమ దేశంలోకి ప్రవేశించే హక్కు లేదని పేర్కొంది. ఈ మేరకు ఎక్స్‌లో పోస్టు పెట్టింది. 'మా దేశంలోకి వచ్చే చట్టబద్ధమైన ప్రయాణికులను అమెరికా స్వాగతిస్తూనే ఉంటుంది. అయితే, చట్టవిరుద్ధమైన వారికి యూఎస్‌ను సందర్శించే హక్కు లేదు. అక్రమ ప్రవేశం, వీసాల దుర్వినియోగం, యూఎస్ చట్టాలను ఉల్లంఘించడాన్ని మేము సహించము. వారిని మా దేశంలోకి అనుమతించబోము' అని భారత్‌లోని యూఎస్ ఎంబసీ తన ట్వీట్‌లో పేర్కొంది. ప్రస్తుతం ఈ ట్వీట్ వైరల్ అవుతోంది.

# ఇద్దరు అమ్మాయిలు ఆత్మహత్య!

**వేద న్యూస్, డెస్క్:**

ప్రస్తుత జనరేషన్ పిల్లలు చాలా సున్నితంగా ఉంటున్నారు. చిన్న చిన్న విషయాలకే మస్తాపాకి గురై ప్రాణాలు తీసుకుంటున్నారు. ఏ చిన్న సమస్య ఎదురైనా దానికి చావే పరిష్కారం అన్న విధంగా ప్రవర్తిస్తున్నారు. పరీక్షలో ఫెయిల్ అయినా, లవ్‌లో ఫెయిల్ అయిన, తల్లి దండ్రులు తిట్టినా.. స్కూల్‌లో టీచర్ తిట్టినా.. ఇలా చిన్న చిన్న విషయాలకే ఆత్మహత్యకు చేసుకుంటున్నారు. తాజాగా ఇంటాంటి ఘటనలే తెలుగురాష్ట్రాల్లో చోటుచేసుకున్నాయి. ఫోన్ ఎక్కువగా మాట్లాడుతున్నారని తల్లిదండ్రులు మందలించడంతో.. మనస్తాపానికి గురైన ఇద్దరు అమ్మాయి ఆత్మహత్యకు పాల్పడి ప్రాణాలు కోల్పోయారు. క్షణికావేశంలో వారు తీసుకున్న నిర్ణయం ఆ రెండు కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది.

# సంపాదకీయం

## న్యాయవ్యవస్థపై సడలుతున్న నమ్మకం

గత మార్చి నెలలో ఢిల్లీ న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ అధికార నివాసంలో భారీ స్థాయిలో కాలిపోయిన నోట్ల కట్టల ఉదంతం దేశవ్యాప్తంగా కలకలం రేపింది. ఆ దృశ్యాలన్నీ ప్రముఖ టివి ఛానల్లలో ప్రసారమవ్వడమే కాకుండా అన్ని పత్రికలు పతాక శీర్షికన ఆ వార్తను ప్రచురించడంతో న్యాయ వ్యవస్థ విశ్వసనీయతపై నీలి నీడలు కమ్ముకున్నాయని న్యాయ నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. అంతేకాక అపనమ్మకం కలిగించే ఇలాంటి సంఘటనల గురించి ప్రజలు పలు విధాలుగా చర్చించుకునేందుకు తావివ్వడంతో పాటు ఇలాంటి సంఘటనలు అన్ని వ్యవస్థల్ని అసంతృప్తికి గురిచేస్తాయని వారు వాపోతున్నారు. సగటు పౌరుని అనుమానాన్ని నివృత్తి చేయడం ద్వారా న్యాయ వ్యవస్థపై నమ్మకాన్ని కలిగించేందుకు కేంద్రం దిద్దుబాటు చర్యలకు పూనుకుంటోంది. దాని కోసం వడివడిగా అడుగులు వేస్తోంది. అందుబాటులో ఉన్న అన్ని అస్త్రాలను సంధించి జస్టిస్ వర్మను సాగనంపడానికి సిద్ధపడుతోంది. జస్టిస్ వర్మ ఇంట్లోకి ఆ నోట్లకట్టలు ఎలా వచ్చాయి? ఎవరిచ్చారు? అనే దానిపై విచారణ చేపట్టడానికి కోర్టులు అనుమతించలేదు. ఎఫ్ఐఆర్ చేయడానికి కూడా అవకాశం ఇవ్వలేదు. సుప్రీం కోర్టు ఎలాంటి బహిరంగ ప్రకటన చేయనప్పటికీ సుప్రీం కోర్టుయే చొరవ తీసుకుని ఇన్ హౌస్ కమిటీ ని వేసి విచారణ చేపట్టి నివేదిక ఇచ్చినట్లు సమాచారం. వర్మకు కీలక సూచనలు, ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది. సుప్రీం కోర్టు జస్టిస్ వర్మను ఢిల్లీ నుండి అలహాబాద్ కోర్టుకు బదిలీ చేసింది. ఆయన అలహాబాద్‌కు వస్తే బహిష్కరిస్తామని అక్కడి బార్ కౌన్సిల్ ప్రకటన చేసిన నేపథ్యంలో ఆయన రావడం రిపోర్టు చేయడం జరిగిపోయినప్పటికీ కేసులు అసైన్ చేయలేదు. అలా చేయడం న్యాయవ్యవస్థపై ప్రజల మనసులలో తొలుస్తున్న అనుమానాలకు సమాధానం కాదని పలువురు న్యాయకోవిదులు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు.

ఇదే అంశంపై ఉపరాష్ట్రపతి జగదీప్ దన్‌ఖడ్ కూడా రెండోసారి వ్యాఖ్యానించడం ఈ సంఘటన ఎంత ప్రాధాన్యతను సంతరించుకున్నదో అవగతమవుతున్నది. వ్యవస్థలను ప్రజలకు జవాబుదారీగా ఉంచాలనే ఉద్దేశంతోనే అభిశంసన తీర్మానం అనేది రాజ్యాంగంలో ప్రవేశపెట్టబడింది. ఈ అభిశంసన అనేది హైకోర్టు, సుప్రీం కోర్టు న్యాయమూర్తుల పారదర్శకతపై అనుమానాలు, విమర్శలు, ఆరోపణలు తలెత్తినప్పుడు వారిని తొలగించేందుకు చేపట్టే ప్రక్రియ. ఇది చట్టపరంగా పార్లమెంటుకు ఉన్న ప్రత్యేకమైన వెసులుబాటు. ఈ ప్రక్రియను జడ్జెస్ ఎంక్వయిరీ యాక్ట్ 1968 ద్వారా చేపడతారు. లోక్‌సభలో అయితే కనీసం 100 మంది, రాజ్యసభ అయితే 50 మంది సభ్యులు ఈ తీర్మానం మీద సంతకం చేయాలి. రాజ్యసభ చైర్మన్ లేదా లోక్‌సభ స్పీకర్ చేత నియమించబడ్డ విచారణ కమిటీ ద్వారా నివేదిక ఇవ్వబడుతుంది.

ఆ నివేదిక ద్వారా న్యాయమూర్తి దోషిగా తేలితే దానిని పార్లమెంటు ఉభయ సభలలో ప్రవేశపెట్టబడి మూడింట రెండోవంతు మెజారిటీతో ఆమోదించబడితే రాష్ట్రపతి సదరు న్యాయమూర్తిని తొలగిస్తారు. ఇప్పుడు ఉన్న పరిస్థితులలో ఆ మెజారిటీ సాధించడం అధికార పక్షానికి పెద్ద కష్టమేమీ కాదని రాజకీయ పండితులు అంచనా వేస్తున్నారు. విపక్షాలపై ఆధారపడకుండానే అభిశంసన ప్రక్రియను పూర్తి చేసే అవకాశం ఉన్నప్పటికీ వర్మ తీరును విపక్షాలు సైతం తప్పు పడుతుండడంతో అభిశంసనకు మరింత బలం చేకూరడం తథ్యమని విమర్శకులు సైతం విశ్లేషిస్తున్నారు. యశ్వంత్ వర్మ కేసు విషయంలో సుప్రీం కోర్టు నియమించిన ఇన్ హౌస్ కమిటీ నివేదికలో భారీ మొత్తంలో కాలిపోయిన నోట్ల కట్టల ఆధారాన్ని బలంగా పేర్కొనడంతో అభిశంసనకు మరింత మద్దతు పెరగడం ఖాయమని న్యాయనిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇదిలా ఉండగా ఇప్పటివరకు అభిశంసన ప్రక్రియలు చాలా అరుదుగానే జరిగాయి. 1991లో సుప్రీం కోర్టు న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ వి రామస్వామిపై ఆర్థిక అవకతవకల ఆరోపణలతో లోక్‌సభలో 108 మంది సభ్యులచే అభిశంసన తీర్మానాన్ని ప్రవేశపెట్టబడినప్పటికీ కాంగ్రెసు గైర్హాజరు కావడంతో ఈ తీర్మానం వీగిపోయింది. ఆయన పూర్తికాలం కొనసాగినప్పటికీ ఆయనకు కేసులు మాత్రం అసైన్ చేయలేదు. ఇక 2011లో కలకత్తా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సౌమిత్రా సేన్ పై ఆర్థిక అవకతవకలపై రాజ్యసభలో తీర్మానం ప్రవేశపెట్టబడి ఆమోదించబడింది. లోక్‌సభలో ఓటింగ్‌కు ముందే ఆయన రాజీనామా చేయడంతో ఆ వివాదం అంతటితో ముగిసిపోయింది. 2017లో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సివి నాగార్జున్ రెడ్డిపై అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టబడినప్పటికీ కొంతమంది ఎంపిలు తమ సంతకాలను ఉపసంహరించడంతో అది కూడా వీగిపోయింది. 2018లో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రాపై రాజ్యసభలో విపక్షాలన్నీఏకమై రాజకీయపరమైన అభిప్రాయాలతో అభిశంసన తీర్మానాన్ని ప్రవేశపెట్టినప్పటికీ రాజ్యసభ చైర్మన్ దాన్ని ప్రాథమిక దశలోని తిరస్కరించడంతో తీర్మానం ముందుకు పోలేదు. ఇలా వెలుగులోకి వచ్చిన సంఘటనలు కొన్ని మాత్రమేనని చీకట్లో ఇంకా ఎన్ని ఉన్నాయోనని ప్రజాస్వామికవాదులు గుసగుసలాడు కుంటున్నారు. రాజ్యాంగపరమైన అంశాలపై ఇటీవల దాఖలైన పలు పిటిషన్లను నామమాత్రమైనా పరిశీలించకుండానే ఆదిలోనే కొట్టివేయడాన్ని ఈ సందర్భంగా ఉటంకిస్తున్నారు. ప్రజాభిప్రాయానికి ప్రతిబింబంగా నిలిచే పార్లమెంటును సైతం న్యాయమూర్తుల నియామకంలో భాగస్వామ్యం చేయకపోవడమేంటని వారు ప్రశ్నిస్తున్నారు. మరోపక్క స్వయం ప్రతిపత్తి అనే పేరున న్యాయ వ్యవస్థలో న్యాయమూర్తుల నియామకాన్ని న్యాయమూర్తులే చేపట్టడం వల్ల పారదర్శకత లోపిస్తున్నదని, జవాబుదారీతనం అడుగంటుతుండడమేకాక 'అంకుల్ జడ్జి సింద్రోమ్' వల్ల తమ అనుయాయులకే పెద్దపీట వేసే అవకాశం ఉన్నదని న్యాయ కోవిదులు అభిప్రాయపడుతున్నారు. దీన్ని అధిగమించడానికి 99వ రాజ్యాంగ సవరణ ద్వారా తీసుకువచ్చిన జాతీయ న్యాయ నియామకాల కమిషన్ తరహాలో సరికొత్త కమిషన్ ను ఏర్పాటు చేయవలసిన ఆవశ్యకత ఉన్నదని రాజ్యాంగ నిపుణులు సైతం కోరుతున్నారు. మొత్తం మీద పూర్తిస్థాయిలో వ్యవస్థను ప్రక్షాళన చేసి సగటు భారతీయునిలో రాజ్యాంగం పట్ల, న్యాయవ్యవస్థ పట్ల గౌరవాన్ని పెంపొందించే విధంగా అడుగులు పడతాయని ఆశిద్దాం!

# ఫ్లాట్‌గా ముగిసిన భారత స్టాక్ మార్కెట్

**వేద న్యూస్, న్యూఢిల్లీ :**

దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం ఫ్లాట్‌గా ముగిశాయి. రోజంతా ఒడిదొడుకులకు లోనైన సూచీలు చివరికి మిశ్రమంగా స్థిరపడ్డాయి. సెన్సెక్స్ 53.49 పాయింట్లు స్వల్పంగా నష్టపోయి 82,391.72 వద్ద ముగియగా, నిఫ్టీ కేవలం ఒక పాయింటు లాభపడి 25,104.25 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్ సెషన్‌లో ఐటీ షేర్లలో కొనుగోళ్ల సందడి కనిపించింది. నిఫ్టీ ఐటీ ఇండెక్స్ 1.67 శాతం మేర లాభపడింది. దీంతోపాటు ఫార్మా, ఎఫ్ఎంసీజీ, మెటల్, మీడియా, ఎనర్జీ, కమోడిటీస్ రంగాల సూచీలు కూడా లాభాల్లో ముగిశాయి. అయితే, ఆటో, పీఎస్‌యూ బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, రియల్టీ, మౌలిక సదుపాయాల రంగాల షేర్లు అమ్మకాల ఒత్తిడికి గురై నష్టాలను చవిచూశాయి. సెన్సెక్స్ ప్యాక్‌లో టెక్ మహీంద్రా, టాటా మోటార్స్, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్, అల్ట్రాటెక్ సిమెంట్, టీసీఎస్, ఐటీసీ, యాక్సిస్ బ్యాంక్, నెస్లే, అదానీ పోర్ట్స్ షేర్లు ప్రధానంగా లాభపడిన వాటిలో ఉన్నాయి. మరోవైపు, మారుతీ సుజుకీ, ఏషియన్ పెయింట్స్, బజాజ్ ఫైనాన్స్, టాటా స్టీల్, బజాజ్ ఫిన్‌సర్వ్, ఐసీఐసీఐ బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లు నష్టపోయిన వాటిలో ముందున్నాయి. విశ్లేషకుల అంచనా ప్రకారం, నిఫ్టీ గత కొంతకాలంగా కొనసాగుతున్న కన్సాలిడేషన్ జోన్ పైన స్థిరంగా కొనసాగుతోందని, ఇది మార్కెట్ అప్‌ట్రెండ్ కొనసాగింపునకు సంకేతమని తెలుస్తోంది. "నిఫ్టీ 24,850 కీలక మద్దతు స్థాయికి పైన ఉన్నంత కాలం ఈ సానుకూల ధోరణి కొనసాగే అవకాశం ఉంది. స్వల్పకాలంలో నిఫ్టీ 25,350 స్థాయికి చేరుకోవచ్చు. ఒకవేళ ఈ స్థాయిని నిలకడగా దాటితే మరింత ర్యాలీకి అవకాశం ఉంది," అని ఎల్‌కేపీ సెక్యూరిటీస్‌కు చెందిన రూపక్ దే తెలిపారు. ప్రస్తుతం మార్కెట్లో స్థిరీకరణ కనిపిస్తున్నప్పటికీ, మెరుగవుతున్న నగదు లభ్యత, కంపెనీల స్థిరమైన ఆర్జనలు, విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడిదారుల (ఎఫ్‌పీఐ) ఆసక్తి వంటి అంశాలు బుల్స్‌కు ఆశాజనకంగా ఉన్నాయని పీఎల్ క్యాపిటల్




అడ్వైజరీ హెడ్ విక్రమ్ కసత్ అభిప్రాయపడ్డారు. ఇక కరెన్సీ మార్కెట్ విషయానికొస్తే, గతవారం ఆర్‌బీఐ వడ్డీ రేట్లను 0.50 శాతం తగ్గించడంతో (మొత్తం 100 బేసిస్ పాయింట్లు) మార్కెట్లోకి అదనపు ద్రవ్య లభ్యత పెరిగింది. ఇది గత వారం నుంచి పెరుగుతున్న ముడి చమురు ధరల ఒత్తిడిని కొంతమేర తగ్గించింది. దీంతో డాలర్‌తో రూపాయి మారకం విలువ 85.67 వద్ద ఫ్లాట్‌గా, సానుకూలంగా ట్రేడ్ అయింది. ఈ వారం విడుదల కానున్న అమెరికా ద్రవ్యోల్బణ (సీపీఐ) గణాంకాలు డాలర్ ఇండెక్స్‌పై ప్రభావం చూపుతాయని, రూపాయి 85.25 నుంచి 86.00 శ్రేణిలో కదలాడవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. మరోవైపు, బంగారం ధరలు ఔన్సుకు 3,315-3,320 డాలర్ల వద్ద, పది గ్రాములకు సుమారు 97,000 రూపాయల వద్ద స్థిరంగా ఉన్నాయి. అమెరికా-చైనా వాణిజ్య చర్చల అప్‌డేట్స్ కోసం మార్కెట్ వర్గాలు ఎదురుచూస్తున్నాయి. "ఒకవేళ ఇరు దేశాల మధ్య బలమైన సానుకూల ఒప్పందం కుదిరితే, బంగారం ధర 95,000 రూపాయల స్థాయికి దిగిరావచ్చు. అదే సమయంలో ప్రతికూల వ్యాఖ్యలు వస్తే ధర 98,500 రూపాయలు, ఔన్సుకు 3360 డాలర్ల వరకు పెరిగే అవకాశం ఉంది. ఈ వారంలో వెలువడే అమెరికా సీపీఐ గణాంకాలు కూడా కీలకం కానున్నాయి" అని ఎల్‌కేపీ సెక్యూరిటీస్‌కు చెందిన జతీన్ త్రివేది వివరించారు.

# రోజా, వైసీపీ కలిసి నాకు అక్రమ సంబంధాలు అంటగట్టారు

**వేద న్యూస్, విజయవాడ :**




సీఎం చంద్రబాబుకు తాను మద్దతు పలుకుతున్నానంటూ వైసీపీ నేత రోజా చేసిన వ్యాఖ్యలపై ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (పీసీసీ) అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ, రోజాపై నిప్పులు చెరిగారు. రోజా ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నానని తెలిపారు. వైసీపీ నేతలు తనపై, తన తల్లి విజయమ్మపై గతంలో చేసిన దారుణమైన ప్రచారాన్ని గుర్తుచేసుకుంటూ ఆవేదన చెందారు. "రోజా, వైసీపీ కలిసి నాకు అక్రమ సంబంధాలు అంటగట్టారు. నా రక్త సంబంధమే నా మీద విష ప్రచారం చేసింది. నేను వైఎస్సార్‌కే పుట్టలేదని దారుణంగా ప్రచారం చేశారు. విజయమ్మకు నేను అక్రమ సంతానం అని కూడా ప్రచారం చేశారు. మీరు చేసిన ఇలాంటి అసభ్యకరమైన వ్యాఖ్యల వల్ల నేను ఎంతగా మానసిక క్షోభ అనుభవించి ఉంటానో ఆలోచించండి" అంటూ షర్మిల ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో తన సోదరుడు కష్టాల్లో ఉన్నారని తెలియగానే, రక్త సంబంధానికి విలువ ఇచ్చి 3,200 కిలోమీటర్ల సుదీర్ఘ పాదయాత్ర చేశానని షర్మిల గుర్తుచేశారు. "మీరు మనుషులు కాదు. రక్త సంబంధం గురించి మాట్లాడటానికి మీకు సిగ్గుండాలి. విజయమ్మను పార్టీ నుంచి బయటకు పంపిన రోజే మీ పతనానికి పునాది పడింది. ఇప్పటికైనా మీరు బుద్ధి తెచ్చుకోవాలని కోరుతున్నాను" అని వైసీపీ నేతలను ఉద్దేశించి షర్మిల ఘాటుగా వ్యాఖ్యానించారు. రాష్ట్ర సమస్యలపై జరిగే ప్రజా పోరాటాలకు మాత్రమే తన మద్దతు ఉంటుందని షర్మిల స్పష్టం చేశారు. రాజకీయాలకు అతీతంగా, ప్రజల పక్షాన నిలబడతానని ఆమె పునరుద్ఘాటించారు. షర్మిల వ్యాఖ్యలు ప్రస్తుతం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి.

### శ్రీనగర్-కత్రా వందేభారత్ రైల్లో నేషనల్

# కాన్ఫరెన్స్ నేత ఫరూక్ అబ్దుల్లా పయనం


**కశ్మీర్‌కు రైల్వే సేవలు రావడం చూసి కళ్లు చెమ్మగిల్లాయని వ్యాఖ్య**

**వేద న్యూస్, న్యూఢిల్లీ :**



జమ్మూకశ్మీర్‌లో ఇటీవలే ప్రారంభమైన శ్రీనగర్-కత్రా మార్గంలోని వందేభారత్ రైలులో నేషనల్ కాన్ఫరెన్స్ అధినేత ఫరూక్ అబ్దుల్లా ప్రయాణించారు. దేశ రైల్వే వ్యవస్థతో ఎట్టకేలకు కశ్మీర్ లోయ పూర్తిస్థాయిలో అనుసంధానం కావడం పట్ల ఆయన తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. ఈ చారిత్రక ఘట్టాన్ని చూసి తన కళ్లు చెమ్మగిల్లాయని తెలిపారు. ఈ సందర్భంగా ఫరూక్ అబ్దుల్లా మాట్లాడుతూ, "దేశ రైల్వే నెట్‌వర్క్‌తో కశ్మీర్ కలవడం చూసి నా హృదయం ఆనందంతో ఉప్పొంగిపోయింది. నా కళ్లు చెమ్మగిల్లాయి. ఈ ఘనతను సాకారం చేసిన ఇంజినీర్లు, కార్మికులందరినీ మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను" అని పేర్కొన్నారు. జమ్మూ నుంచి కత్రా వరకు సాగిన రైలు ప్రయాణం తనకు గొప్ప అనుభూతినిచ్చిందని, ముఖ్యంగా అంజీ వంతెనతో పాటు సొరంగాల ద్వారా సాగిన ప్రయాణం ఎంతో అద్భుతంగా ఉందని, ఇది చిరకాలం గుర్తుండిపోయే అనుభవమని ఆయన వివరించారు. ఈ రైలు సేవల వల్ల ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని, ప్రయాణం మరింత సులభతరం అవుతుందని ఫరూక్ అబ్దుల్లా అన్నారు. జులైలో ప్రారంభం కానున్న అమర్‌నాథ్ యాత్రకు వచ్చే భక్తులు ఈ రైలు సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకునే అవకాశం ఉందని, దీనివల్ల వైష్ణోదేవి ఆలయానికి కూడా భక్తుల తాకిడి పెరుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. స్థానికంగా వాణిజ్యం, పర్యాటకం గణనీయంగా అభివృద్ధి చెందడంతో పాటు ఇరు ప్రాంతాల ప్రజల మధ్య స్నేహ సంబంధాలు మరింత బలపడతాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఇది ప్రజలు సాధించిన విజయమని ఆయన కొనియాడారు. కాగా, జమ్మూకశ్మీర్‌లోని కత్రా, శ్రీనగర్ పట్టణాలను కలుపుతూ ఏర్పాటు చేసిన ఈ వందేభారత్ రైలు సర్వీసులను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జూన్ 6న ప్రారంభించిన విషయం తెలిసిందే. ఉదంపూర్-శ్రీనగర్-బారాముల్లా రైల్ లింకు ప్రాజెక్టులో భాగంగా ఈ మార్గాన్ని పూర్తిచేశారు. జమ్మూ ప్రాంతాన్ని కశ్మీర్ లోయతో కలిపే తొలి రైలు ఇదే కావడం గమనార్హం.

# భర్త హత్యకు తొలుత రూ.4లక్షల సుపారీ ఆపై రూ.20లక్షలకు పెంపు



**వేద న్యూస్, ఇంటర్నెట్ డెస్క్:**

హనీమూన్‌లో ఉండగా హత్యకు గురైన మధ్యప్రదేశ్ వ్యక్తి రాజా రఘువంశీ కేసుకు సంబంధించి కీలక అంశాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. భర్తను హత్య చేయించేందుకు సోనమ్ తొలుత నిందితులకు రూ.4లక్షల సుపారీ ఆఫర్ చేసిందని పోలీసుల వర్గాలు తెలిపాయి. ఆ తర్వాత ఆఫర్‌ను రూ.20లక్షలకు పెంచినట్టు వెల్లడించాయి. సోనమ్, రాజా దంపతులను నిందితులు తొలుత బెంగళూరులోనే కలుసుకున్నారు. ఆ తర్వాత కనెక్టింట్ ఫ్లైట్‌లో నిందితులు ఈశాన్య రాష్ట్రానికి వెళ్లారు. మే 11న సోనమ్, రాజా వివాహం జరిగింది. కొన్ని రోజులకే వారు రాజా హత్యకు ప్లాన్ చేశారు. సోనమ్ ప్రియుడు షిల్లాంగ్‌కు వెళ్లకపోయినా తెర వెనక ఉండి మరీ కుట్ర పన్నాడు. సోనమ్‌తో నిరంతరం టచ్‌లో ఉన్నాడు. మే 21న నవదంపతులు గువహటీకి వెళ్లగా.. నిందితులు వారిని ఫాలో అయ్యారు. మే 22న రాజా, సోనమ్ షిల్లాంగ్‌కు వెళ్లారు. నిందితులు కూడా వారిని అనుసరించారు. ఆ మరుసటి రోజే రాజా హత్య జరిగినట్టు విశ్వసనీయవర్గాలు తెలిపాయి. ఆ రోజున రాజా, సోనమ్ జలపాతాన్ని చూసేందుకు ఓ కొండ వద్దకు వెళ్లారు. నిందితులు కూడా వారిని అనుసరించారు. ఆ సమయంలోనే సోనమ్ అలసిపోయినట్టు నటించింది. రాజాతోపాటు నిందితుల కంటే వెనకగా నడవడం ప్రారంభించింది. వెళ్లారు. నిందితులు కూడా వారిని అనుసరించారు. ఆ మరుసటి రోజే రాజా హత్య జరిగినట్టు విశ్వసనీయవర్గాలు తెలిపాయి. ఆ రోజున రాజా, సోనమ్ జలపాతాన్ని చూసేందుకు ఓ కొండ వద్దకు వెళ్లారు. నిందితులు కూడా వారిని అనుసరించారు. ఆ సమయంలోనే సోనమ్ అలసిపోయినట్టు నటించింది. రాజాతోపాటు నిందితుల కంటే వెనకగా నడవడం ప్రారంభించింది.నిర్మానుష్య ప్రాంతానికి చేరుకున్నాక భర్తను హత్య చేయాలని వారికి చెప్పింది. అయితే, అప్పటికే తాము అలసిపోయామంటూ నిందితులు తెలిపారు. ఈ క్రమంలో సోనమ్ సుపారీ ఆఫర్‌ను రూ.20లక్షలకు పెంచినట్టు తెలిసింది. ఆ తర్వాత రాజాపై దాడి జరిగింది. అతడి తలపై ముందు, వెనకా గట్టిగా కొట్టడంతో అతడు కుప్పకూలిపోయాడు. ఈ క్రమంలో మృతదేహాన్ని నిందితులు లోయలోకి తోస్తుంటే సోనమ్ కూడా సహకరించిందని సమాచారం.

# ఉగ్రవాదంతో రెచ్చగొడితే ఇంటికొచ్చి మరీ దాడులు.. పాక్‌కు జైశంకర్ స్ట్రాంగ్ వార్నింగ్

**వేద న్యూస్, ఇంటర్నెట్ డెస్క్:**

ఉగ్రదాడులతో రెచ్చగొడితే పాక్‌స్థాన్ లోపలకు చొచ్చుకెళ్లి మరీ భారత్ దాడులు చేస్తుందని విదేశాంగ శాఖ మంత్రి ఎస్.జైశంకర్ దాయాది దేశాన్ని హెచ్చరించారు. పహల్గాం వంటి పాశవిక ఉగ్రదాడులకు టెర్రరిస్టు సంస్థలు, వారి నేతలు పాల్పడితే దెబ్బకు దెబ్బ తీస్తామని స్పష్టం చేశారు. 'ఉగ్రవాదులు ఎక్కడ దాక్కునా ఖాతరు చేయం. పాకిస్థాన్ లోపల దాక్కున్నా... అక్కడికీ చొచ్చుకెళ్లి దాడులు చేస్తాం' అని జైశంకర్ తెలిపారు. పహల్గాం ఉగ్రదాడికి జవాబుగా భారత్ ఆపరేషన్ సిందూర్ నిర్వహించిన నెల రోజుల అనంతరం యూరప్‌లో జైశంకర్ పర్యటిస్తున్నారు. ఇందులో భాగంగా బెల్జియం, లక్సంబర్గ్‌లో భారత సంతతి ప్రజలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఎంతో మంది అమాయకులను పొట్టన పెట్టుకున్న ఉగ్రవాదులకు బహిరంగంగానే పాకిస్థాన్ శిక్షణ ఇస్తూ, వారిని ఇండియాపైకి ఉసిగొలుపుతోందని కేంద్రమంత్రి దుయ్యపట్టారు. ఉగ్రవాదాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదన్నారు. భారత్‌పై దాడులకు ఉగ్రవాదాన్ని ఒక సాధనంగా పాకిస్థాన్ మార్చుకుందని, ఇదే రెండు దేశాల మధ్య సమస్యలకు దారితీస్తోందని చెప్పారు.

వేద న్యూస్

బుధవారం జూన్ 11, 2025

# శివుడిని మించిన ఖాకీ..!

- ఈ కేసులో ఇంటి దొంగను పట్టుకున్న పోలీసులు
- 'భళా..' రక్షక భటులకు సలాం అంటూ పలువురి ప్రశంస

**వేద న్యూస్, వరంగల్ క్రైమ్ :**



ఇంటి దొంగను ఈశ్వరుడు కూడా పట్టలేడనేదీ నానుడి. కాగా, శివుడిని మించిన ప్రతిభ పాటవాలు నేర్పరితనంతో.. ఓ కేసులో ఇంటి దొంగను ఖాకీలు పట్టుకున్నారు. వివరాల్లోకెళితే.. ప్రియురాలి మైకంలో సొంత ఇంటికి కన్నం వేసి కన్నతల్లి బంగారం మాయం చేసిన యువకుడు అడ్డంగా బుక్కయ్యాడు. వరంగల్ నగరంలో అచ్చం సినీ ఫక్కీలో జరిగిన ఈ దొంగతాన్ని పోలీసులు చాకచక్యంగా ఛేదించారు. దొంగిలించిన బంగారమంతా రికవరీ చేసి, ఆ విద్యార్థిని జైలుకి పంపారు. వరంగల్ ఏసీపీ నందిరాం నాయక్ తెలిపిన వివరాల ప్రకారం సోమవారం(జూన్ 09) తెల్లవారుజామున ఖిలా వరంగల్‌లోని రామకృష్ణ అనే వ్యక్తి ఇంట్లో చోరీ జరిగింది. బీరువాలో భద్రపరచిన 16 తులాల బంగారం అపహరణకు గురైంది. దీంతో సమాచారం అందుకున్న మిల్స్ కాలనీ పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని దర్యాప్తు మొదలు పెట్టారు. ప్రాథమికంగా అక్కడ సీన్ చూస్తే దొంగతనాల్లో ఆరితేరిన దొంగ ఈ దోపిడీకి పాల్పడినట్లు సీన్ కనిపిస్తుంది. దీంతో ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపారు పోలీసులు. ఇంట్లోని బంగారమంతా లూటీ అవడంతో లబోదిబోమని మొత్తుకున్న కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన తండ్రితో పాటు పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన కొడుకు జయంత్ బంగారం చోరీపై పోలీసులకు పిట్టకథలు వినిపించారు. అక్కడ తెగ హడావిడి చేశారు. అయ్యో మా బంగారం అంతా పోయిందని కుటుంబం అంతా నెత్తి నోరు బాదుకున్నారు. రంగంలోకి దిగిన పోలీసులు తీగలాగితే ఇంటి దొంగ బయటపడ్డాడు. కేసు పెట్టిన ఓనర్ రామకృష్ణ కొడుకే అసలు దొంగని తేల్చారు. హనుమకొండలోని ప్రముఖ కళాశాలలో డిగ్రీ చదువుతున్న జయంత్ విద్యార్థి, అదే కళాశాలల్లో చదువుతున్న ఒక యువతితో ప్రేమలో పడ్డాడు. ఆ యువతిని ఆకట్టుకోవడం కోసం జల్సా ఖర్చులకు డబ్బు కోసం కక్కుర్తిపడ్డాడు. సదరు యువకుడు ఇంట్లో బంగారంపై కన్నేశాడు. అతని కన్నతల్లి దాచుకున్న బంగారం అంతా ఊడ్చుకుపోయి, అచ్చం సినిమా ఫక్కీలో హైడ్రామా క్రియేట్ చేశాడు. ఎవరో దొంగలు ఇంట్లో పడి బంగారమంతా ఊడ్చుకుపోయినట్లుగా కథ అల్లాడు. ఎంతటి తెలివి గల నేరస్తులైనా పోలీసుల నిఘానేత్రాల నుండి తప్పించుకోలేరన్నట్లు టెక్నాలజీ అతన్ని పట్టించింది. దొంగతనం జరిగిన సమయంలో అతని సెల్ నెట్‌వర్క్ ఆధారంగా పోలీసులు అనుమానం వచ్చి విచారించగా అసలు కథ బయటపడింది. ఇంటి దొంగ బంగారం దొంగిలించినట్లు గుర్తించిన పోలీసులు జయంత్ ను అరెస్టు చేసి, అతని వద్ద 16 తులాల బంగారం రికవరీ చేశారు. తల్లిదండ్రులతోపాటు అతనికి కౌన్సిలింగ్ నిర్వహించి, చోరీ కేసు నమోదు చేసి జైలుకి పంపారు. కన్న కొడుకే ఇంట్లో బంగారం దొంగిలించడం చూసి పోలీసులు షాక్ అయ్యారు. కొడుకు జైలుపాలు కావడంతో ఏం చేయాలో అర్థం కాని దయనీయ స్థితిలో తల్లిదండ్రులు కుమిలిపోయారు. కాగా దొంగతనం కేసుని ఛేదించడంలో ప్రతిభ కనపరిచిన మిల్స్ కాలనీ సీఐ బి. రమేశ్, ఎస్సైలు శ్రీకాంత్, సురేశ్, సిబ్బంది ప్రవీణ్ రెడ్డి, వాజీద్ పాషా, నరేందర్, హోంగార్డు రఫీ, సిబ్బందిని వరంగల్ ఏసీపీ నందిరాం నాయక్ ఈ సందర్భంగా అభినందించారు.



## ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలకు ఉజ్వల భవిష్యత్తు

**వేద న్యూస్, కోరుట్ల ప్రతినిధి :**

జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం డబ్బ గ్రామంలో బడి బాట విద్యార్థుల నమోదు కార్యక్రమం ప్రారంభం అయి 4వ రోజు కొనసాగుతుంది. డబ్బ గ్రామం లో ఉపాధ్యాయులు ఇంటిఇంటికి వెళ్లి బడి పిల్లల నమోదు కార్యక్రమం చేపట్టారు. ఫ్రీ స్కూల్ ఉపయోగించుకోవాలని పిల్లల భవిష్యత్తు కోసం ప్రభుత్వ పాఠశాలలో చదువుకోవాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న విద్యార్థులకు ఉన్నత చదువుల సీట్ల కోసం 24మార్కులు అదనంగా కలుపుతున్నారని ఇది ప్రయివేట్ పాఠశాల లో చదివిన వారికీ ఈ అవకాశం ఉండదని అన్నారు. కేవలం ప్రభుత్వ పాఠశాల లో చదివిన వారికే ప్రాధాన్యత ఉంటుందని ఉపాధ్యాయులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డబ్బ ప్రభుత్వ పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు తనుగుల రమేష్, ఉపాధ్యాయులు మండలోజు అశోక్, అల్లకట్టు సత్యనారాయణ, చిలుముల రాజేష్, ఆడెపు నరేష్, అల్లాడి హరి ప్రసాద్, వేముల నర్సయ్య, బొల్లు శంకర్, పాల్గొన్నారు.



## పదోన్నతి పొందిన శివకృష్ణకి సన్మానం

**వేద న్యూస్, కాజీపేట :**

కాజిపేట్ లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్‌లో ఎస్సై గా పనిచేసి శుక్రవారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఉన్నతదికారుల ఉత్తర్వుల మేరకు ఇన్స్పెక్టర్‌గా పదోన్నతి పొందిన శివకృష్ణని కాజీపేట పోలీస్ స్టేషన్ సుధాకర్ రెడ్డి, పోలీస్ సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఎటువంటి ఆటంకాలు లేకుండా సుధీర్గ కాలం ఎస్సైగా పని చేసినటువంటి శివకృష్ణ సేవలు అద్భుతమని ఈ సందర్భంగా కొనియాడారు. క్రమశిక్షణ పట్టుదలతో పనిచేసిన వారిని ప్రజలు గుర్తిస్తారని, అవిధంగా శివకృష్ణ ఎస్సైగా పనిచేసి నీరూపించారనీ గుర్తు చేశారు. కాజీపేట టౌన్ సీఐ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ ఎస్సై శివకృష్ణ సుదీర్ఘకాలం పని చేసి మచ్చలేని అధికారిగా పేరు తెచ్చుకున్నారనీ, సిబ్బందితో ఎంతో కలుపుగోలుగా ఉంటూ ప్రజల్లో కలిసిపోయి పని చేశారని అన్నారు. శివకృష్ణ ఎక్కడ పని చేసిన మంచి పేరు సంపాదించాలని, ఇన్స్పెక్టర్ గా మంచి పేరు ప్రతిష్ఠలు గడించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై నవీన్, ఏ ఎస్సై శ్రీధర్, సిబ్బంది ఘనంగా సత్కరించారు.




## 'భూ భారతి'తో రైతు సమస్యలు పరిష్కారం

**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :**

మిర్యాలగూడ మండల పరిధిలోని కిష్టాపురం గ్రామంలో భూభారతి కార్యక్రమంపై రెవెన్యూ సదస్సును మంగళవారం నిర్వహించడం జరిగింది.రెవిన్యూ సదస్సులో మిర్యాలగూడ డిప్యూటీ తహసిల్దార్ ఎలక్షన్స్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులు రైతులకు భూభారతి పై కలిగేటువంటి అనుమానాలను నివృత్తి చేయడం జరుగుతుందని ప్రతి ఒక్కరూ రెవిన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.గ్రామంలోని ప్రతి భూ సమస్యకు భూభారతి లో పరిష్కారం లభిస్తుందని సూచించారు.రెవెన్యూ సదస్సులో పరిష్కారం కానీ భూ సమస్యలను పై అధికారులకు విన్నవించడం జరుగుతుందని ఈ సందర్భంగా తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఆర్ ఐ రామకృష్ణ ఠాగూర్,సీనియర్ అసిస్టెంట్ వాసవి, జూనియర్ అసిస్టెంట్ అనిత,శ్యామ్ లతోపాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

## గ్రామసభ ద్వారానే లబ్ధిదారులను ఎంపిక చేయాలి

**మొదటి పేజీ తరువాయి**

బైఠాయించి నిరసన వ్యక్తం చేయడం జరిగింది అన్నారు.ఇప్పటికైనా జరిగినటువంటి ఎంపికను గ్రామసభ నిర్వహించి గ్రామ ప్రజల ఆమోదం చేత లబ్ధిదారులను ఎంపిక చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం జరిగింది.పేద ప్రజలకు అన్యాయం జరిగితే పోరాటాలను ఉధృతం చేస్తామని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు. ఈ నిరసనను పోలీసుల జోక్యంతో శాంతింపజేసి ఎంపీడీవోకి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బహుజన సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు మొగ్గం సుమన్, మారపెల్లి విజయ్, మారపెల్లి సుధాకర్, మొగ్గం వెంకయ్య పాల్గొన్నారు.

## దేశానికి రోల్ మోడల్ భూ భారతి

**మొదటి పేజీ తరువాయి**

చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల కోసం 18 లక్షల దరఖాస్తులు రాగా,దాదాపు 16 లక్షల50 వేల వరకు ఇందిరమ్మఇండ్లు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది అని తెలియజేశారు. నాలుగు లక్షల ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారు అని చెప్పారు. ప్రతి నియోజకవర్గంలో 3500. ఇండ్లు ఇస్తున్నాం.చాలా ఏళ్ళ తర్వాత ఇండ్లు వస్తున్నాయి అని ఆనందం వ్యక్తం చేశారు.

రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ మిర్యాలగూడ ప్రాంతంలో కృష్ణా నదిపై మిగిలిపోయిన ప్రాజెక్టులతో లిఫులను మొదలు పెట్టి పూర్తి చేస్తామని తెలిపారు.నాగార్జునసాగర్ ఎడమ కాలువ మరమ్మత్తులకు త్వరలోనే ఏడు కోట్ల రూపాయలు మంజూరు చేస్తాం అని హామీ ఇచ్చారు. తెలంగాణకు కృష్ణా జలాలలో తెలంగాణకు న్యాయం జరిగేలా పోరాడి తీరుతాం అని చెప్పారు.మా హయాంలోనే ఎస్ఎల్బీసీ టన్నెల్ను పూర్తి చేస్తాం అన్నారు.30 టీఎంసీల ద్వారా ఉమ్మడి నల్గొండ జిల్లాలో సాగు నిరందిస్తాం అన్నారు. ధర్మారెడ్డి,పిల్లాయిపల్లి, బునియాదిగాని కాలువ పనులు పూర్తిచేసి తీరుతాం అని చెప్పారు.ఉమ్మడి నల్గొండ జిల్లాలోని అన్ని ఇరిగేషన్ ప్రాజెక్టులు పూర్తి చేస్తాం అని ధీమా వ్యక్తం చేశారు.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ,తెలంగాణ లో ఇప్పటివరకు పండించని విధంగా రికార్డు స్థాయిలో వరి ధాన్యాన్ని పండించి ఖరీఫ్, రబీలలో 280 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని పండించి తెలంగాణ రాష్ట్రం దేశంలోనే నెంబర్ వన్ గా నిలిచింది.వరి కొనుగోలు చెల్లింపుల లో భాగంగా 12 లక్షల మంది రైతులకు 15126 కోట్ల రూపాయలు చెల్లించామన్నారు.యాసంగి లోనే 73 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశాం అన్నారు.సన్నధాన్యానికి 500. బోనస్ ఇచ్చాము,సన్న బియ్యం కింద అర్హులైన ప్రతి ఆరు కిలోల బియ్యం చొప్పున ఇస్తున్నాం,

అర్హులందరికీ రేషన్ కార్డులు ఇస్తున్నాము అని గుర్తుచేశారు. రాష్ట్ర రోడ్లు,భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి నియోజక వర్గం వారీగా 3500 మందికి ఐదు లక్షల రూపాయల చొప్పున ఇండ్ల నిర్మాణం చేపడుతున్నామన్నారు. ఈ ప్రభుత్వంలో పేదలు బాగుండాలని ప్రతి పేదవాడికి 5 లక్షలతో ఇళ్లు కట్టిస్తున్నాం, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడం లాంటి చెప్పిన హామీలే కాకుండా చెప్పని హామీలు కూడా నెరవేరుస్తున్నామని పేదలందరూ బాగుండాలనేది మా ఆకాంక్ష అని అన్నారు.

గత ప్రభుత్వం కావాలనే ఎస్ఎల్బీసీ పూర్తి చేయలేదు. ధర్మారెడ్డి,పిల్లయిపల్లి అన్ని ప్రాజెక్టులు పూర్తి చేస్తాము.జిల్లాను అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి,రాష్ట్ర శాసనమండలి సభ్యులు శంకర్ నాయక్ ,రెవిన్యూ అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్,సబ్ కలెక్టర్ నారాయణ అమిత్,నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం, గృహ నిర్మాణ శాఖ పిడి రాజకుమార్, పలు మండలాల తాసిల్దారులు,ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఫిర్యాదుదారు వద్దకే న్యాయమూర్తి

**వేద న్యూస్, కోరుట్ల ప్రతినిధి :**



పెరలిసిస్‌తో బాధ పడుతున్న మహిళా ఫిర్యాదుదారు ఓపెన్ కోర్టు హాల్ లోకి రాలేని పరిస్థితి తెలుసుకున్న న్యాయమూర్తే స్వయంగా బయటికి వచ్చి నిలబడి విచారణ చేసిన ఘటన మంగళవారం మెట్ పల్లి కోర్టులో జరిగింది. ఇబ్రహీంపట్నం పోలిసులు అందించిన సమాచారం ప్రకారం, ఈ నెల 14 న జరగనున్న లోక్ అదాలత్ లో భాగంగా రాజీ కేసుల విచారణ ప్రారంభం అయ్యింది. ఈ క్రమంలో ఇబ్రహీంపట్నం మండలం గోధుర్ గ్రామానికి చెందిన చల్ల రమక్క, అదే గ్రామానికి చెందిన చల్ల మల్లేష్, చల్ల శంకర్ లపై ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా, వారిద్దరిపై ఎస్సై సెక్షన్ 329(4), 292, 118(1) ల కింద యఫ్. ఐ. ఆర్. నెంబర్ 174/2024 నమోదు చేసి మెట్ పల్లి కోర్టుకి ఛార్జిషీట్ పంపించారు. అనంతరం కోర్టు అట్టి కేసుకి క్యాలండర్ కేసు నెంబర్ 549/2024 కేటాయించి నిందితులకు అప్పియరెన్స్ నోటీసులు పంపించగా, నిందితులు మరియు పిర్యాదుదారు కలసి కేసు రాజీ చేసుకుని మంగళవారం కోర్టుకి వచ్చారు. పిర్యాదుదారు పేరాలసిస్ తో బాధ పడుతూ కోర్టు హాల్ లోకి రాలేని పరిస్థితి తెలుసుకున్న మెట్ పల్లి జూనియర్ సివిల్ జడ్జి నారం అరుణ్ కుమార్ ఓపెన్ కోర్టులోని విచారణ కేసుల్ని పక్కన పెట్టి ఆటోలో వచ్చిన చల్ల రమక్క వద్ద వివరాలు నమోదు చేసుకుని మల్లేష్, శంకర్ లపైన ఉన్న కేసుని కొట్టివేస్తున్నట్టు ప్రకటించారు. ఇక్కడ ఇబ్రహీంపట్నం పోలీస్ సిబ్బంది, కోర్టు సిబ్బంది ఉన్నారు.

## బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత అరెస్ట్

**వేద న్యూస్, హైదరాబాద్ :**

తెలంగాణ జాగృతి నేత, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అరెస్టయ్యారు. పెంచిన బస్ పాస్ ధరలను వెంటనే తగ్గించాలంటూ తెలంగాణ జాగృతి కార్యకర్తలతో కలిసి ఇవాళ(మంగళవారం) బస్ భవన్‌ను ముట్టడించేందుకు కవిత ప్రయత్నించారు. ఆ క్రమంలో ఆమె ప్రయత్నాన్ని పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఆమె రోడ్డుపై బైఠాయించడంతో భారీగా ట్రాఫిక్ స్తంభించింది. ఈ మేరకు కవిత, పోలీసుల మధ్య తీవ్ర వాగ్వివాదం చోటు చేసుకుంది. కవిత ధర్నాతో స్థానికంగా ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. దీంతో కల్వకుంట్ల కవితను పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం ఆమెను చంద్రయాణ గుట్ట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. తెలంగాణ ప్రజలను రేవంత్ రెడ్డి ప్రభుత్వం అడ్డగోలుగా దోచుకుంటోందని.. విద్యార్థులు, ప్రజలపై తీవ్ర భారం పడుతోందని ఈ సందర్భంగా కవిత ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు చంద్రయాణ గుట్ట పోలీస్ స్టేషన్‌కు కవితను తరలించారు. దాంతో జాగృతి కార్యకర్తలు సైతం భారీగా పోలీస్ స్టేషన్‌కు చేరుకుని పోలీసులు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అన్ని రకాల బస్ పాస్ ఛార్జీలను టీజీఎస్ఆర్టీసీ పెంచింది.

ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్‌తో పాటు మెట్రో డీలక్స్ ఛార్జీలనూ పెంచేసింది. దాదాపు 20 శాతం మేర ఛార్జీలను పెంచడంతో హైదరాబాద్ నగర వాసులపై అధిక భారం పడనుందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. అయితే ఈ బస్ పాస్ ఛార్జీల పెంపుపై రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఇప్పటికే స్పందించారు. బస్ పాస్ ఛార్జీలు పెంచి చాలా కాలమైందని.. ఈ నేపథ్యంలో వాటిని పెంచాల్సి వచ్చిందంటూ వివరణ ఇచ్చారు.



## చీకట్లో బతుకు వెతుకులాట!

యాడ బాయరో
నా బంగారు తెలంగాణ..!
ఎక్కడ బాయరో నా తెలంగాణ ఉద్యమ నినాదం..!
ఏమై పాయరో నీళ్ళు, నిధులు, నియామకాలు..!

ఎవనిపాలాయరో
ఆ కోటి రాతణాల వీణ..!
ఎవనికి కుర్చీలాయరో మరిచిన ఆత్మహత్యల
నినాదాలతో, లక్ష్యాలతో ఉద్యమ త్యాగాలు..!

నా దేశం వెలిగిపోతోంది
ఓవైపు బంగారు తెలంగాణ అన్నరు..!
ఇంకోవైపు డిజిటల్ ఇండియా వెలుగులు అన్నరు..!

ఎత్తైన విగ్రహాల సాక్షిగా
నా తెలంగాణ వెలిగిపోతున్నది..!
దశాబ్ది ఉత్సవాల సాక్షిగా
తెలంగాణ రాష్టంలోనే ఈ విధంగా ఉంది అంటే
నా దేశంలోని పరిస్థితి ఆగమ్యగోచరమే..!

డబ్బుతో రాజకీయ నాయకులు
ఓట్లను కొనుక్కొని గద్దలెక్కుతున్నారు..!
వాళ్లకు అనుకూలమైన శాసనాలను తయారు చేసుకొని
దేశాన్ని రాష్ట్రాన్ని పాలిస్తున్నారు..!

పేదల హక్కులను కాలరాస్తున్నారు..
పేదరికానికి వాళ్లను ముంచేస్తున్నారు.
పేదరికంలో వాళ్లను ముంచేస్తూ..దేశాన్ని, రాష్ట్రాన్ని
రాష్ట్ర నిధులను, వనరులను
దోసుకుంటున్నారు, దోచిపెడుతున్నారు.

ఇంకెంతకాలం భరిద్దాం?
ఇప్పటికైనా ప్రజలు చైతన్యవంతం కావాలి..!

అప్పుడు మాత్రమే మనం,
మన హక్కులు, మనకు చేరాల్సిన, మనకు రావాల్సిన
నిధులు మనకు వస్తాయి.

రాబోవు తరాలకు కూడా మిగిలి ఉంటాయి.
లేక పోతే చీకట్లో వెతికున్నట్టే ఉంటాయి మన జీవితాలు..!
బతికినట్టే ఉంటాము కానీ బతకలేము
తిన్నట్టే ఉంటాము కానీ తినలేము..!

దయచేసి ఆలోచించండి హక్కుల కోసం..!
ఎదురుతిరిగి ప్రశ్నించండి అందుకోసం..!!
ఆ కలలు కన్న బంగారు తెలంగాణ కోసం..!!!

**- రవి బాబు పిట్టల,**
**పర్యావరణవేత్త.**

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073